# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లోని పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టుకు రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈ రోజు శంకుస్థాపన చేస్తారు.**

2. **రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులను మరింత బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **దేశవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతానికి పైగా ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు.**

4. **దేశంలో పండించే అన్ని పంటలను ధరల మద్దతు పథకంలో చేర్చాలని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తారు. ఇందులో భాగంగా జిల్లాలోని పుట్టపర్తిలో ప్రతిష్టాత్మక అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ – ఏఎంసీఏ ప్రాజెక్టుకు రక్షణ మంత్రి, ముఖ్యమంత్రి భూమి పూజ చేస్తారు. సుమారు 15 వేల 803 కోట్ల రూపాయల వ్యయంతో, 650 ఎకరాల్లో ఈ ప్రాజెక్టు నిర్మించనున్నారు. భారతదేశపు తొలి పిఫ్త్ జనరేషన్ స్టెల్త్ మల్టీ రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ అభివృద్ధి లక్ష్యంగా ఈ కేంద్రం పనిచేయనుంది. యుద్ధ విమానాల తయారీతో పాటు పరీక్షలు కూడా పుట్టపర్తిలోనే నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 7 వేల 500 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

--------------------------

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరులను మరింత బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రభుత్వానికి సమకూరుతున్న ఆదాయంపై చర్చించారు. 2026-27 ఆర్థిక సంవత్సర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని వివిధ శాఖలకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గనులు, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నులు, రవాణా తదితర శాఖలు ఆదాయాన్ని పెంచేలా పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతి రూపాయి సద్వినియోగం అయ్యేలా చూడాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కనబరిచిన ప్రతిభ అభినందనీయమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన సత్కార కార్యక్రమంలో కేంద్ర మంత్రి నిన్న పాల్గొన్నారు. విద్యార్థులు అధిక మార్కులు సాధించడంలో విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు చేసిన కృషి కీలక పాత్ర పోషించాయని మంత్రి పెమ్మాసాని చంద్రశఖర్ తెలుపుతూ.

వాయిస్ 27 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా నిర్వహించే పోటీ పరీక్షల విశ్వసనీయత కాపాడాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. నీట్--2026 పరీక్షకు సంబంధించి వచ్చిన ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలు, పరీక్ష నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పారదర్శకంగా విచారణ చేపట్టాలని నిన్న ఒక ప్రకటనలో కోరారు. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు, సాంకేతిక రక్షణ చర్యలు, జవాబుదారీతనం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో మూత్రపిండాలు, కాలేయ, గుండె సంబంధిత తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు ప్రభుత్వం 895 కొత్త ఫించన్లు మంజూరు చేసిందని. గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. అమరావతిలో మంత్రి నిన్న మాట్లాడుతూ... ఎన్టీఆర్ భరోసా ఫించన్ పథకం కింద డయాలసిస్ చేయించుకుంటున్న వారికి ఈ పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కొత్త పెన్షన్లతో ప్రభుత్వంపై ప్రతి నెలా 86 లక్షల 34 వేల రూపాయల అదనపు భారం పడనున్నట్లు తెలిపారు.

---------------------------

దేశవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతానికి పైగా ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిన్న మంత్రి మాట్లాడుతూ... పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం గత రెండేళ్లుగా గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలుపుతూ.

వాయిస్ 25 సెకన్లు

---------------------------

సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో జీవించాలన్నదే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయస్వామి అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి అధ్యక్షతన ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డు సమావేశం నిన్న జరిగింది. ఈ సమావేశంలో ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ట్రాన్స్‌జెండర్లకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. వారి కోసం ఆసుపత్రుల్లో ప్రత్యేక ఓపీ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. సెర్ప్, మెప్మా సంస్థల సహకారంతో ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

దేశంలో పండించే అన్ని పంటలను ధరల మద్దతు పథకం – పీఎస్ఎస్‌లో చేర్చాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పంట దిగుబడుల్లో 75 శాతం వరకు కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు నిన్న లేఖ రాశారు. రైతులకు నిజమైన గిట్టుబాటు ధరలు అందాలంటే కనీస మద్దతు ధరలు - ఎంఎస్‌పీని 30 నుంచి 40 శాతం వరకు పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పత్తి, పప్పుధాన్యాలు, నూనెగింజలు సహా ఇతర పంటల విషయంలో కూడా రైతులకు భరోసా కల్పించేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు సూచించారు.

---------------------------

అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఆధునిక సమాజంలో కుటుంబాల ప్రాధాన్యత పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్న ఉద్దేశ్యంతో ప్రతి ఏడాది మే 15వ తేదీన అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. కుటుంబ విలువలను పెంపొందించడం, కుటుంబ వ్యవస్థను బలపరచడం, సమాజంలో కుటుంబ పాత్రను గుర్తించడం సమాచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు కుటుంబ వ్యవస్థ పట్ల అవగాహన కలిగించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

రవాణా రంగం ప్రజల దైనందిన జీవితంలో కీలక పాత్ర పోషిస్తోందని, ప్రభుత్వం రవాణా రంగ బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ రవాణా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బస్ ఆపరేటర్స్ నూతన కార్యవర్గ సభ్యులు మంత్రిని నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవాణా రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతం దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ పట్నం వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది ఈశాన్య దిశగా కదిలే అవకాశం ఉందని ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రానున్న ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జగన్నాథ కుమార్ తెలియజేస్తూ,

వాయిస్ 34 సెకన్లు

=====================